ఊరికో బెల్టు..
పల్లెకో రేటు



గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు ఏర్పాటు చేయడానికి వీలులేదు. బెల్టు షాపు పెడితే.. బెల్టు తీస్తా.. ఎంఆర్పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలు, నాయకులు జోక్యం చేసుకోవద్దంటూ ఇటీవల పలు బహిరంగ సమావేశాలల్లో స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన హెచ్చరికలు ఇవి. అయితే ఆయన హెచ్చరికలు క్షేత్ర స్థాయిలో ఎక్కడా అమలు కావడం లేదు. గ్రామ స్థాయిలో **నిత్యావసర** సరకుల మాదిరిగా ప్రతి దుకాణంలో మద్యం విచ్చలవిడిగా అదనపు **రేట్లకు విక్ర**యిస్తూ కూటమి గ్రామ స్థాయి నేతలు జేబులు నింపుకుంటున్నారు.

- గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు
- క్వార్టర్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ. 50 వరకు అదనం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- కూటమి ప్రభుత్వ హెచ్చరికలు నామమాత్రమే!

వరదయ్యపాళెం : మద్యం బెల్టు షాపుల విషయంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఉన్నాయి. మద్యం దుకాణాలు టెండర్ల ద్వారా చేజిక్కించుకున్న వారి కనుసన్నల్లో గ్రామస్థాయిలో బెల్టు దుకాణాలు రోజురోజుకు పుట్టుకొస్తున్నాయి. గ్రామాల్లో ఉన్న చిల్లర కొట్టు దుకాణాల్లో సరకులతో పాటు మద్యం విక్రయాలు షరా మామూలైంది. నియంత్రించాల్సిన ఎక్సైజ్‌శాఖ, పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

సత్యవేడు నియోజకవర్గంలో బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా ఏర్పాటవుతున్నాయి. ఆ దశగా నియోజకవర్గ పరిధిలోని 7 మండలాల్లో 34 మద్యం దుకాణాలు అధికారికంగా ఉన్నాయి. అనధికారిక బెల్టు దుకాణాలు మాత్రం 102 పైచిలుకు ఉన్నట్లు సమాచారం. దీంతో మద్యం బాబులకు కిక్కు కాస్త ఎక్కువై పచ్చని కుటుంబాల్లో చిచ్చు రేగుతోంది. గ్రామస్థాయిలో తెల్లవారే సరికి మద్యం అందుబాటులో ఉండడంతో పూర్తిగా మద్యానికి బానిసవుతున్నట్లు కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు.

అదనపు ధరలు

గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న బెల్టు షాపుల్లో క్వార్టర్ బాటిల్‌పై రూ. 30 నుంచి రూ. 50 వరకు అదనపు రేట్లకు విక్రయిస్తూ మద్యం బాబులను దోపిడీ చేస్తున్నారు. మద్యానికి బానిసైన వారు అదనపు రేట్లను లెక్క చేయకుండా కొనుగోలు చేస్తున్నారు. ఎంఆర్పీకే విక్రయిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నేతల ప్రచారాల అసత్యపు ప్రచారాలుగా మారాయని మందుబాబులు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

గ్రామ స్థాయిలో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు పుట్టుకొస్తున్నా నియంత్రించాల్సిన ఎక్సైజ్‌శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. వారి తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 7 మండలాల్లో పెద్ద ఎత్తున బెల్టుషాపులు పుట్టుకొస్తున్నప్పటికీ వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నియోజకవర్గంలోని 7 మండలాల్లో 102కు పైగా బెల్టు దుకాణాలు నిర్వహణ జరుగుతున్నట్లు సమాచారం.

సత్యవేడు నియోజకవర్గంలో మద్యం దుకాణాలు, బెల్టు షాపుల వివరాలు ఇలా..

మండలం	మద్యం దుకాణాలు	బెల్టుషాపులు
నాగలాపురం	05	15
వరదయ్యపాళెం	05	25
పిచ్చాటూరు	03	12
నారాయణవనం	03	05
కేవీబీపురం	03	15
బీఎన్‌కండ్రిగ	05	10
సత్యవేడు	10	20

కఠిన చర్యలు తీసుకుంటాం

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే నాగలాపురం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పలువురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశాం. ఎప్పటికప్పు డు పల్లెల్లో ప్రత్యేక నిఘా ఉంచాం. రోజువారీ త నిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటాం.

– దశరథ రామిరెడ్డి, సీఐ, ఎక్సైజ్‌శాఖ, నాగలాపురం

క్లుప్తంగా

పంచాయతీల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతిమ

సత్యవేడు : పంచాయతీల్లో అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసి, వాటి అభివృద్ధికి సర్పంచులు, ఎంపీటీసీలు కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీపీ ప్రతిమ కోరారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం పంచాయతీ సమగ్రాభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ఆర్థిక ప్రణాళికలో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలలో జీపీడీపీ అబ్జర్వర్ ప్రసాద్, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ తరుణాక్షరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పరిపాలన భవనంలో శనివారం క్యాలెండర్లను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి ఆవిష్కరించారు. సాధారణంగా ఆలయ క్యాలెండర్లను ఉగాది సమయంలో ఆవిష్కరిస్తుంటారు. అయితే గత ఈవో చంద్రశేఖర్ ఆజాద్ చొరవతో నూతన సంవత్సరం సందర్భంగా క్యాలెండర్లను ఆవిష్కరించే విధంగా ఏర్పాట్లు చేశారు. దాని ఫలితంగా శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు



ఉత్తమ అధికారులకు సన్మానం

శ్రీకాళహస్తి : చిత్తూరు కేంద్ర గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ , తదితర పోటీలను నిర్వహించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన గ్రంథాలయ అధికారులు లావణ్య, దాక్షాయణి, హరికృష్ణ, రామలక్ష్మమ్మను సన్మానించారు. కార్యక్రమంలో శర్మ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించండి



మాట్లాడుతున్న డీవైఈఓ ప్రభాకర్‌రాజు

బుచ్చినాయుడుకండ్రిగ : ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు తెలిపారు. శనివారం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థుల చదువులపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి, పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య పాల్గొన్నారు.


ఉత్తమ ఉపాధ్యాయుడికి ఎమ్మెల్యే సత్కారం

వరదయ్యపాళెం : పిచ్చాటూరు మండలంలో రాజానగరం జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయుడు కామాక్షయ్య ఇటీవల రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఆయనకు మండలంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

రాయితీ వేరుశెనగ విత్తనాల పంపిణీ

వరదయ్యపాళెం : నియోజకవర్గంలోని నాగలాపురంలో రాయితీపై పంపిణీ చేసే వేరుశెనగ విత్తనాలను శనివారం సాయంత్రం వేరుశెనగ విత్తనాల బస్తాలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తున్న విత్తనాలను అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ సుబ్బారావు, ఈఓపీఆర్డీ వెంకటరత్నమ్మ, నాయకులు ఇలంగోవన్ రెడ్డి, సెల్వకుమార్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఊయల సేవలో కల్యాణ వెంకన్న



నారాయణవనం : పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఉత్సవర్లకు ఊంజల్ సేవను నిర్వహించారు. సాయంత్రం అర్చకులు తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని అధిష్ఠింపజేశారు. ఆలయ అధికారి నాగరాజు, జమేదార్ మల్లికార్జున్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎంపీడీఓ కార్యాలయ శిలాఫలకం ధ్వంసం

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్దనున్న శిలాఫలకాన్ని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. 2022వ సంవత్సరం డిసెంబరు 1వ తేదీన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనం ఆధునీకరణ ప్రారంభోత్సవం సందర్భంగా శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. శిలాఫలకం ధ్వంసంపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్ రావు తెలిపారు.



ధ్వంసం చేసిన శిలాఫలకం, శిలాఫలకం (ఫైల్)

గుంతలతో బేజారు



మండలంలో శనివారం జోరుగా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రేణిగుంటలోని పాత చెక్‌పోస్ట్ సమీపంలో ఉన్న రైల్వే వంతెన కింద వర్షానికి నీళ్లు పొంగి ప్రవహించాయి. వాహనదారుల సర్కస్ ఫీట్లు చేయాల్సిన దుస్థితి నెలకొంది. అన్నాసామిపల్లి , ఎర్రమరెడ్డిపాళెం , తారకరామానగర్ రోడ్లు బురదమయంగా మారాయి. ఏర్పేడు మండలం బండారుపల్లిలో రోడ్లు గోతుల్లా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. – రేణిగుంట

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న పాఠశాల బస్సు

– తప్పిన ప్రమాదం

నాగలాపురం : విద్యుత్ స్తంభాన్ని పాఠశాల బస్సు ఢీకొన్న సంఘటన మండలంలోని వెళ్లూరు వద్ద శనివారం చోటుచేసుకుంది. పిచ్చాటూరులోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను ఎక్కించుకుంటూ వెళ్లూరు మీదుగా వెళ్లసాగింది. వాహనాన్ని చోదకుడు వేగంగా నడపడంతో అదుపు చేయలేక రహదారి పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టాడు. సంఘటనలో విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో బస్సులోని విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. విద్యార్థులందరూ సురక్షితంగా ఉండటంతో స్థానికులు వారిని బస్టాప్ వరకు తీసుకువెళ్లి మరో వాహనంలో పాఠశాలకు పంపించారు.



ప్రమాదానికి గురైన పాఠశాల బస్సు

సీఎం పర్యటనకు ఏర్పాట్లు

రేణిగుంట: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో రేణిగుంట విమానాశ్రయంలో చేపట్టాల్సిన పలు చర్యల, భద్రత ఏర్పాట్లపై రేణిగుంట విమానాశ్రయంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.



సమావేశమైన కలెక్టర్, ఎస్పీ అధికారులు

ఘనంగా కుంభాభిషేక ఉత్సవాలు



మండలంలోని చిన్న పాండూరు వడ్డిపాళెంలో నూతనంగా నిర్మించిన శ్రీ భూమి నీలాదేవి సమేత శ్రీనివాసస్వామి ఆలయంలో శనివారం ఆలయ కుంభాభిషేక ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో హోమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శంకరాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. – వరదయ్యపాళెం

లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం



న్యాయమూర్తి శ్రీనివాసనాయక్

శ్రీకాళహస్తి : హైకోర్టు ఆదేశాల మేరకు డిసెంబరు 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ పేర్కొన్నారు. న్యాయస్థాన భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్ అనేది ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వేదిక అన్నారు. ఇందులో తీర్పు అంతిమమని తెలిపారు. దీనిపై అప్పీల్‌కు తావులేదన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, అధికారులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రక్షాళనపై ఎమ్మెల్యే సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రక్షాళనపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆలయ పరిపాలన భవనంలో అధికారులతో శనివారం సమావేశమయ్యారు. ఆలయంలో ప్రక్షాళనకు పలు సూచనలు చేశారు. దళారీ వ్యవస్థను అణచివేసే విధంగా పలు నిర్ణయాలు తీసుకోవాలని ఈవో బాపిరెడ్డికి సూచించారు. పలు రాష్ట్రాల నుంచి ఆలయం వద్ద వసతిగృహాలు నిర్మించేందుకు దాతలు ముందుకు వచ్చారని తెలిపారు. ఆలయం ఆధ్వర్యంలో ఆస్పత్రిని నడిపే విధంగా ఆలోచన చేయాలని అధికారులకు సూచించారు.

22న జామాయిల్ మొక్కల సాగుపై అవగాహన

సత్యవేడు : జామాయిల్ సాగు, మొక్కల విక్రయాలపై ఈనెల 22న రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సత్యవేడు అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ బ్రహ్మయ్య తెలిపారు. 22న ఏపీఎస్టీసీ కార్యాలయంలో మధ్యాహ్నం 3గంటలకు రైతులకు అవగాహన సదస్సు ఉంటుందన్నారు. ఆసక్తి గల రైతులు సదస్సుకు హాజరు కావాలని కోరారు.

వారపు సంత..
వానొస్తే చింత

- మురుగు మధ్యనే క్రయవిక్రయాలు
- రేణిగుంట సంతలో కానరాని కనీస వసతులు



బురదలో నడిసొస్తేనే..కూరగాయలు

రేణిగుంట : రేణిగుంటలో ప్రతి శనివారం వారపు సంత.. జిల్లాలోనే కాదు.. పక్కనున్న తమిళనాడు రాష్ట్రం నుంచి ఈ సంతలో సరుకులు కొనుగోలు చేసేందుకు ప్రతివారం ఎంతో మంది వస్తుంటారు. ఎండు చేపలకు ప్రసిద్ధి కావడంతో ఈ సంతకు ఎంతో ఆదరణ ఉంది. అయితే సంత ఆదాయాన్ని అనుభవించే పంచాయతీ పాలకులు అభివృద్ధిని గాలికొదిలేశారు. దీంతో వానొస్తే సంతలో ఇటు కూరగాయల విక్రయదారులు, గ్రామాల నుంచి వచ్చే కొనుగోలుదారుల అవస్థలు వర్ణనాతీతం. సంతలో నిలువు నీడ లేకపోవటంతో ఎవరికి వారు టార్పాలిన్ పట్టలను కట్టుకుని దుకాణాలను నడుపుతున్నారు. కింద బురదగుంటలు ఏర్పడి రొచ్చురొచ్చుగా తయారవడంతో అడుగు తీసి అడుగెయ్యాలంటే ఇబ్బందిగా మారుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సంతలో కనీస వసతులను కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



బురదగుంట వద్దనే కూరగాయల క్రయవిక్రయాలు

ఆగమోక్తంగా ఆకాశదీపం



జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఆకాశదీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతిరోజు ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. – శ్రీకాళహస్తి

బాధిత కుటుంబాలకు ఎంపీ పరామర్శ



అపరంజి రాజు కుటుంబికులను పరామర్శిస్తున్న ఎంపీ డాక్టర్ గురుమూర్తి

నాగలాపురం : స్థానిక వైస్ ఎంపీపీ కుమారి భర్త వైఎస్సార్‌సీపీ నేత ఉదయ్ కుమార్ రెడ్డి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చైన్నైలోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది తిరిగి ఇంటికి వచ్చారు. సమాచారం తెలుసుకున్న ఎంపీ డాక్టర్ గురుమూర్తి , సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తో కలసి శనివారం నాగలాపురంలోని ఉదమ్‌కుమార్ రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. అంతకు ముందు మండల కన్వీనర్ అపరంజిరాజు భార్య సుజాతమ్మ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బీరేంద్రవర్మ, బానుప్రకాష్ రెడ్డి, చిన్నదొరై, మోహన్ మొదలియార్ కులశేఖర్ రెడ్డి, దేశప్పాన్, ధేశన్, శ్యామ్, మురళి, సచివాలయ కన్వీనర్ దేశప్పన్ పాల్గొన్నారు.

పిల్లల జీవన నాణ్యత పెంపునకు కృషి

సత్యవేడు : విద్యార్థుల్లో జీవన నాణ్యత, సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రవి తెలిపారు. శనివారం బాలుర గురుకుల పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం నిర్వహించారు. కౌమార, యుక్త వయస్సు లోని పిల్లలకు పుట్టుకతో లోపాలు, చిన్నతనంలో వచ్చే పౌష్టికాహార లోపాలు, రోగాలు, అంగవైకల్య లక్షణాలు వ్యాధుల గురించి దానుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్ వివరించారు. విద్యార్థులకు ఎత్తు, బరువు , రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స, శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయించేందుకు తిరుపతిలోని డీఐఈసీ కేర్‌కు పంపిస్తామన్నారు. మండల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల పరిధిలో ఈ కార్యక్రమాలు ఈనెల 28 తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్రహ్మణ్యం, భువనేశ్వరి పాల్గొన్నారు.

రైతులకు శాస్త్రీయంగా సలహాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నాగమణి

శ్రీకాళహస్తి రూరల్ : సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల మూలాలను అర్థం చేసుకొని శాస్త్రీయంగా సలహాలు ఇవ్వాలని వ్యవసాయ శాస్త్రవేత్త, డాక్టర్ నాగమణి సూచించారు. శ్రీ కాళహస్తి డివిజన్‌లో పని చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులకు శ్రీకాళహస్తి ఏపీ సీడ్స్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విత్తనశుద్ధితో తొలిదశలో చీడలని అదుపు చేయవచ్చునని తెలిపారు. సేంద్రీయ ఎరువులని విరివిగా వాడడంతో భూమి ఆరోగ్యం మెరుగుపడి పంట బాగా వస్తుందని వివరించారు. వరి పొలాలకు అధికంగా కాంప్లెక్స్ ఎరువులని వాడటం వలన భూములు చౌడు బారి అనేక సూక్ష్మపోషక లోపాలు కనిపిస్తాయని తెలిపారు. సక్రమ నీటి యాజమాన్యం ద్వారా చీడల బెడద తగ్గి పంట నాణ్యంగా వస్తుందని అన్నారు. అనంతరం సిబ్బందికి పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు జిల్లా వనరుల కేంద్రం కో ఆర్డినేటర్ భాస్కరయ్య అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో వేణుగోపాలరావు, రాస్ కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ దివ్య, వ్యవసాయ అధికారులు సూర్యప్రకాష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కాళహస్తి ఏడీఏ రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యతుకు బాటలు వేసుకోవాలి



నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

నారాయణవనం : స్థానిక సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డేను నిర్వహించారు. ఓపెన్ ఆడిటోరియంలో జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపల్స్ చంద్రశేఖర్, జనార్ధనరాజు మాట్లాడుతూ.. జూనియర్లు, సీనియర్లు సోదర భావంతో మెలగాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో తోడ్పాటుగా ఉండాలని కోరారు. యువ ఇంజనీర్లు బీటెక్ కేరీర్‌ను విజయవంతంగా పూర్తి చేసుకోవాలన్నారు. కళాశాలలోని సౌకర్యాలను, డిజిటల్ లైబ్రరీని, అత్యాధునిక పరిశోధనశాలను వినియోగించుకుని తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. యువ ఇంజనీర్లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

వర్షానికి కూలిన చెట్టు : ట్రాఫిక్ అంతరాయం

వరదయ్యపాళెం : మండలంలోని కదూరు కూడలి-సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గంలోని సుబ్బరాజుకండ్రిగ సమీపంలో శనివారం సాయంత్రం కురిసిన గాలివానకు భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా నేలకొరిగింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం ఆ మార్గంలో పరిశ్రమల నుంచి కార్మికులు విధులు ముగించుకుని వెళ్లే సమయం కావడంతో వాహనాలు పెద్దఎత్తున ఆగిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ మల్లికార్జున, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్, జేసీబీల సహాయంతో భారీ వృక్షాన్ని రోడ్డుపై నుంచి తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును జేసీబీతో తొలగిస్తున్న పోలీసులు